# సింహాచలము

శ్రీ మహా విష్ణువు నరసింహావతారంగా వెలసిన వరాహనరసింహ క్షేత్రం సింహాచలం. ఈ దివ్యాలయం విశాఖపట్టణానికి 10 కి.మీ దూరంలో ఉంది. తూర్పు కనుమలలో లాసన్స్ బే నుంచి మొదలైన కొండల వరుసలో కైలాసగిరి అనే పచ్చని ప్రాంతంలో సముద్రమట్టానికి 800 అడుగుల ఎత్తున ఉంది ఈ ఆలయం. ఆ కొండ పడమటి వాలు మీద చెట్లతో నిండిన లోయ ఉంది. గుడికి వెళ్లే దారి కొండ కింద అడివివరం అనే పల్లె దగ్గర మొదలయి సుమారు 1000 మెట్ల మీదుగా సాగుతుంది. అందమైన లోయ గుండా సాగే ఈ దారి ఇరు పక్కల అనాస, మామిడి, పనస తోటలు, రకరకాల పూల తోటలు కనబడతాయి. జల పాతాలుగా సాగుతుండే ఒక కొండకాలువ కూడా ఉందక్కడ. కొండ దిగువన దారి మొదట్లో ఉండే ద్వారాన్ని భైరవద్వారమంటారు. కొంత దూరం తర్వాత హనుమాన్ ద్వారం వస్తుంది. సాగి ధార అనే ప్రవాహం  పక్కన దేవతా మూర్తులు కూడా అక్కడే కనబడతాయి. దారి ముందుకు సాగుతుంటే పక్కన మరో జలపాతం ఆకాశధార అక్కడ స్నానాలు చేస్తుండే భక్తులను చూడవచ్చు. మెట్ల మీద ఇంకొంచెం ముందుకు పోతే జోడు భద్రాలు అనే పవిత్రమైన మెట్లు వస్తాయి. ఇంకా పైకి సాగితే ఒక రంగప్రదేశం అందులో శ్రీ వరాహనరసింహుని కోవెల కనబడతాయి.

**ఆలయం**

ఎత్తైన గోడలతో కోటలాగ ఉండే ఈ ఆలయం ఎంతో మహత్తరమైనది. ఆలయం పడమటికి మళ్లి ఉంటుంది. చుట్టూ ప్రాకారం తూర్పు పడమరల్లో ద్వారాలు ఉన్నాయి. పడమటిది ప్రధాన ద్వారం. గాలి గోపురం దాని మీదే ఉంది. ప్రాకారం మధ్యలో నలుచదరంగా గర్భగుడి, దాని మీద గోపురం, చుట్టూ మందిరం, ముందు సభా మంటపం, అన్నీ వరుసగా అందమయిన శిల్ప సంపదతో తూర్పు నుంచి పడమటికి వ్యాపించి ఉన్నాయి.

మూల మందిరాన్ని ఆవరిస్తూ మరో ప్రాకారం దీర్ఘచతురస్రాకారం గలది ఉంది. ఇందులో వాయవ్య మూలన కళ్యాణ మంటం ఉంది. ప్రవేశ ద్వారానికి 34 అడుగుల దూరంలో, ఉత్తర దక్షిణాలు పడమట నడవలతో, పదహారు స్తంభాలు పైన గోపురంగా కప్పు గలిగి ఉంటుంది సభా మందిరం.

ప్రధాన ద్వారం సభా ద్వారాల మధ్యన 50 అడుగుల ఎత్తు గలిగిన ధ్వజస్తంభం ఉంది. సభామందిరం గోడల లోపల బయటా శాసనాలు చెక్కబడి ఉన్నాయి.

**కప్ప స్తంభము**

గర్భగుడికి సభామందిరానికీ నడుమనుండే నడవలో కప్పస్తంభమనే స్తంభం ఉంది. దీన్ని కావాలించుకుని కోరికలు కోరిన వారికి ముఖ్యంగా పిల్లలు లేని వారికి ఆ కోరికలు తీరుతాయని నమ్మకం.

**మూలస్వామి**

అక్కడినుంచి భక్తులు ముందుకు సాగితే దీర్ఘచతురస్రాకారంగా ఉండే ప్రహ్లాద మంటపం లోని గర్భగుడిలో మధ్యన నిలిచిన వరాహనరసింహులు దర్శనమిస్తారు. మంటపానికీ గర్భాలయానికీ మధ్యన ప్రదక్షిణ మార్గం ఉంది. మూలవిరాట్టు మూర్తి సంవత్సరమంతా చందనలేపంతో కప్పబడి ఉంటుంది. అది చందన లింగంలాగ కనబడుతుంది.
వైశాఖమాసంలో తదియనాడు చందనయాత్ర అనే ఉత్సవంలో భాగంగా స్వామి నిజరూపం బయటపడుతుంది. అది త్రిభంగ రూపంలో వరాహ శిరస్సు సింహపు తోక గల రూపం. స్వామికి ఇరు పక్కల చేతులలో పద్మాలతో శ్రీదేవి, భూదేవి లోహ విగ్రహాలున్నాయి.
స్వామి 108 సాలగ్రామల హారం ధరించి ఉంటారు.
నడవలో ఆగ్నేయ భాగాన ఒక వేదిక మీద ఆళ్వారుల విగ్రహాలున్నాయి.

**వేదిక**

సభామందిరానికి అంటుకుని పడమటి దిక్కున తిరుచిట్టుమాల అనే వేదిక ఒకటి ఉంది. పండుగలు ప్రత్యేక పర్వాలప్పుడు స్వామిని ఉత్సవంగా దీని చుట్టూ ఊరేగిస్తారు. దీనికి ఈశాన్య మూలలో రాతి రథం ఉంది. నిజానికి మంటపానికి ముందు చక్రాలు గుర్రాలను మలిచి రథం లాగ కనిపించేట్లు చేసిన నిర్మాణమిది. అందుకే దీన్ని రథమంటపం అంటారు. రథసప్తమి నాడు స్వామిని ఇక్కడికి వేంచేపు చేసి ప్రత్యేక పూజాదికాలు కొనసాగిస్తారు.

**ఆండాళ్ కోవెల**

పన్నిద్దరాళ్వారులలో ఒకరైన ఆండాళు రంగనాథుని దేవేరి. మూలమందిరానికి దక్షిణాన ప్రత్యేకంగా ఆమెకొక ఆలయం ఉంది. పీఠం మీద అభయముద్రతో నిలిచి ఉన్న

ఆండాళు తల్లి శిలావిగ్రహంగా అక్కడ మనకు దర్శనమిస్తుంది.

## లక్ష్మి కోవెల

వరాహ నరసింహుని దేవేరి చతుర్భుజతాయారు. తిరు చిట్టుమాల వాయవ్య భాగంలో గోడలో మలచిన ఒక గదిలో మకరతోరణం, పద్మాసన మూర్తిగా ఆమె తన గుడిలో ఉంది.

## ఆళ్వారుల కోవెల

భోగమందిరానికి పక్కనుండే రాతి విగ్రహాలే కాక వైష్ణవాచార్యులాన పన్నెండుగురు ఆళ్వారులకు సభామందిరం దక్షిణంలో మరొక మందిరం కూడా ఉంది. ఆళ్వారులూ ప్రధాన ఆచార్యుల విగ్రహాలు ఒక వంపు తిరిగిన వరుసలో ఉన్నాయి. ఎత్తైన వేదిక మీద స్వాములంతా అభయముద్ర పట్టి ఆసీనులై ఉన్నారు. ఇందులో భగవద్రామానుజులను ప్రత్యేకంగా చూడవచ్చు.

## కళ్యాణమంటపం

ఆవరణలో ఈశాన్యభాగంలో నైరుతిలో ప్రవేశద్వారంతో స్తంభాలుగల కల్యాణమంటం ఉంది. చైత్రమాసంలో ఇందులో స్వామి కల్యాణం  ప్రతి ఏటా జరుగుతుంది.

## తీర్థవని (స్నానఘట్టం)

కోవెలకు ఈశాన్యంగా ఫర్లాంగు దూరంలో సంవత్సరమంతా ప్రవహించే గంగధార అనే స్నానఘట్టం ఉంది. కళ్యాణోత్సవం తర్వాత స్వామి ఇక్కడికి స్నానానికి వస్తారు. తలనీలాలు సమర్పించిన భక్తులు పెద్దా పిన్నా భేదం లేకుండా గంగధారలో పవిత్రస్నానాలు చేస్తారు. దీనికి తూర్పున పెళ్లిళ్లకు వాడుకునే స్తంభాల మంటపం ఉంది. ఈ క్షేత్రంలో రెండు పుష్కరుణులున్నాయి. కొండ దిగువన ఉండేది స్వామి పుష్కరణి. ఇంకా దిగువన ఊళ్లో ఉండేది వరాహ పుష్కరణి.

## కొండ మీద ఇతర దేవాలయాలు

కొండ మీద మరెన్నో చిన్న గుడులున్నాయి. త్రిపురాంతక మందిరం గంగధారకు వెళ్లే దారిలో ఉంది. అక్కడ ఒక రాతి నంది విగ్రహం కూడా ఉంది. లింగాకారంలో త్రిపురాంతకులూ, లోహ మూర్తిగా త్రిపురసుందరి  ఇక్కడ దర్శనమిస్తారు. పక్కనే అశ్వత్థవృక్షం, నాగులకట్ట కూడా ఉన్నాయి. గంగధార దగ్గర ఒక ఆవరణలో సీతారామస్వామి కోవెల ఉంది. ఇందులో సీత, రాముల విగ్రహాలున్నాయి.

కొండవాలులో ఏటవాలుగా ఉండే పడమటి రాతి మీద ఒక మందిరం ఉంది. విజయనగర ప్రభువు కృష్ణరాయలు వేయించిన జయస్తంభం ఉందక్కడ. వరాహనరసింహుని మందిరానికి వెళ్లే దారిలో ఒక ఇంటిని మార్చి మందిరంగా రూపొందించిన కాశీ విశ్వేశ్వరాలయం ఉంది. మధ్య గదిలో కాశీ విశ్వేశ్వరులు అన్నపూర్ణ ఇతర దేవతల మూర్తులు ఉన్నాయిక్కడ.

**స్థలపురాణం**

శ్రీ వైష్ణవ సిద్ధాంత ప్రవర్తకులైన భగవద్రామానుజులు పూరీ శ్రీకూర్మం మొదలైన చోట్ల శాస్త్ర చర్చలలో విజయం సాధించిన తర్వాత వరాహ నరసింహుల కోవెలను దర్శించారట. ఇక్కడి పండితులను కూడా వారు చర్చకు ఆహ్వానించారు. వారిని జయించి మందిరాన్ని చేజిక్కించుకుని దాన్ని వైష్ణవాలయంగా మార్చారు.

**సాహిత్యం**

మహాభారతంలోని అరణ్య పర్వ శేషాన్ని తెలుగు చేసిన మహాకవి ఎర్రా ప్రగడ. ఆయన తన మరో రచన నృసింహపురాణంలో సింహాద్రిని, వరాహనరసింహులను గొప్పగా వర్ణించాడు.

కొండవీటి రెడ్డిరాజుల ఆస్థానకవి శ్రీనాథుడు సింహాద్రి తిరునాళ్లను వర్ణించాడు.

కృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో, ఆయన ఆస్థానంలోని ప్రబంధకవి అల్లసాని పెద్దన మనుచరిత్రలో, పింగళి సూరన కళాపూర్ణోదయంలో, ధూర్జటి తన రచనల్లో ఈ క్షేత్రాన్ని ప్రస్తావించి ప్రశంసించారు.

**కళాకేంద్రం**

సింహాచల క్షేత్రం సంస్కృతికి సంరక్షగా కళలకు కాణాచిగా నిలిచింది. మందిరంలోని ఆచార్యులు వైష్ణవ సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. ఇక్కడి బ్రాహ్మణులు వేదం, పురాణ, నాటక, ఇతిహాసాల బోధనలో కాలం గడిపారు. వీరందరికి వెన్నుదన్నుగా మధ్వాచార్యులు నరహరి తీర్థులు ఉండేవారు. 13వ శతాబ్దంలో ఆయన గొప్ప స్వామిగా, పండితులు, ప్రజానాయకులుగా పేరొందినవారు. కళింగ ప్రాంతంలోని మతవ్యవస్థకు మధ్యయుగంలో ఆయన ఎంతో సేవ చేశారు.

ఇంతటి మహత్తరమైన సింహాచల వరాహనరసింహులక్షేత్రాన్ని దర్శించడానికి నేటికీ ఎక్కడెక్కడినుంచో భక్తులు వస్తుంటారు. ఇదొక అసామాన్య మైన క్షేత్రం...